నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని భవానీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. భవానీనగర్, కేఎల్‌రెడ్డినగర్, హెచ్‌సీఎల్‌నగర్, మల్లాపూర్ విలేజ్, ఎస్వీ నగర్, మైప్లవర్ పార్క్, మల్లాపూర్ మజీద్ ఏరియాలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఉప్పల్: ఆదర్శనగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 వరకు సాయిరాంనగర్ కాలనీ ఆదర్శనగర్, వెంకటేశ్వర కాలనీ, ఆనంద్‌నగర్, మ్యాక్‌డోల్ కాలనీ న్యూహేమానగర్, పద్మావతి కాలనీ, వెస్ట్ బాలాజీ హిల్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నిఖిల్ తెలిపారు. దీంతో పాటు మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు సెవన్‌హిల్స్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, పద్మావతి కాలనీ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉప్పల్: నాచారం ఐఐసిటి ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4 గంటల వరకు హబ్సిగూడ వీధి నంబర్–1, హరిజన బస్తీ, పీఅండ్‌టీ కాలనీ, కాకతీయనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గణేష్ తెలిపారు.

శ్రీవారి హుండీ లెక్కింపు


ఆలయ హుండీ లెక్కింపులో భక్తులు

కుషాయిగూడ: కుషాయిగూడ శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపును శుక్రవారం ఆలయంలో నిర్వహించారు. ఎండోమెంట్ అధికారి సీహెచ్ ప్రణీత్ కుమార్ పర్యవేక్షణలో నాలుగు నెలల హుండీని లెక్కించారు. స్వామి వారికి రూ.7,19,955 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ సంకూరి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.వీరేశం, వేణు పంతులు, తాళ్ల వెంకటేష్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్ యాదవ్, రఘుపతి, లక్ష్మీనారాయణ, అమర్‌చారి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత తప్పనిసరి


సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. మల్కాజిగిరి డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో రూ.23 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో పార్కు అభివృద్ధి, బస్తీ దవాఖానా, యూజీడీ పైపులైన్, రూ.75 లక్షలతో కల్వర్టు, కమ్యూనిటీ హాల్ అభివృద్ధి, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో డీఈ మహేష్, ఏఈ నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అవమానించడం సరికాదు


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తదితరులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కౌకూర్‌లో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి బొబ్బిలి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జైబాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం ఏ.ఫహీమ్, కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ హాజరై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం, రాజ్యాంగ నిర్మాతలను అవమానిస్తోందని అన్నారు. అనంతరం భరత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్‌రెడ్డి, సీఎల్.యాదగిరి, లక్ష్మీకాంతరెడ్డి, కృష్ణగౌడ్, భాస్కర్, శివ, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, మల్లిఖార్జున్, వెంకటేష్‌గౌడ్, శేఖర్, శకుంతల నాయుడు, కవిత, లక్ష్మీ పాల్గొన్నారు.

రేషన్ షాపులకు సన్న బియ్యం

పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఉగాది రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఆహార భద్రత కార్డు ఉన్న వారికి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు సంబంధించి పక్క జిల్లాల్లోని మండలస్థాయి గోదాముల నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా రేషన్ దుకాణాల్లోకి చేరవేసే ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని అర్బన్ ప్రాంతాలకు ప్రతినెలా రేషన్ పంపిణీ ఆలస్యం అవుతోంది. అన్నిచోట్లా నెల ప్రారంభం నుంచి సరకులు ఇస్తుండగా.. కొన్ని పురపాలక సంఘాల్లో మాత్రం రెండో వారం ప్రారంభిస్తున్నారు. ఈ సారి కూడా ఆలస్యం చేస్తారా.. అనుకున్న సమయానికి పంపిణీ చేస్తారా? అనేది చూడాల్సి ఉంది. రేషన్ కార్డులో ప్రతి సభ్యుడికి ఉచితంగా ఆరు కిలోలు అందజేస్తారు. – సాక్షి, సిటీబ్యూరో

పేదలకు సన్న బియ్యం పంపిణీకి యంత్రాంగం సన్నాహాలు

- ఉగాది కానుకగా.. ఏప్రిల్ నుంచి రేషన్ షాపుల ద్వారా పంపిణీ
- రేషన్ బియ్యం అక్రమ రవాణా అడ్డుకట్టకు చర్యలు
- గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు తరలించేందుకు కసరత్తు
- 5.23 లక్షల ఆహార భద్రతా కార్డుదారులకు 10,640 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం



బయటి మార్కెట్లో సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి. ఇది వరకు రేషన్ దుకాణాల్లో ఇచ్చే దొడ్డు బియ్యం అమ్మేసి ఆ డబ్బులతో సన్న బియ్యం కొనుగోలు చేసే వారు. దీంతో రేషన్ బియ్యం పక్కదారి పట్టేది తాము అధికారంలోకి వస్తే సన్న బియ్యం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఏడాది దాటిన తర్వాత సన్న బియ్యం పథకం అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. ఈ ప్రక్రియతో అక్రమాలకు చెక్ పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా..

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నాయి. అందులో భాగంగా పేద, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసరాలు అందించేందుకు రేషన్ దుకాణాలను ఏర్పాటు చేశారు. ప్రతి నెలా లబ్ధిదారులకు ఉచితంగా బియ్యం అందిస్తున్నారు. దొడ్డు రకం బియ్యం తీసుకునేందుకు చాలా మంది ఆసక్తి చూపకపోవడం, ప్రజల అవసరాల మేరకు సన్నబియ్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

అక్రమాలకు అడ్డుకట్ట

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో చాలా కుటుంబాలు సన్నబియ్యం వినియోగిస్తుండటంతో దొడ్డు బియ్యం అక్రమార్కులకు వరంలా మారుతోంది. లబ్ధిదారుల నుంచి కిలోకు రూ.10 నుంచి రూ.15 చొప్పున కొనుగోలు చేస్తూ.. రూ.లక్షల్లో అక్రమ దందా సాగిస్తున్నారు. అధికారులే కొన్ని చోట్ల అక్రమార్కులకు సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తుండగా, పలువురు రేషన్ షాపు డీలర్లు కూడా వంతపాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రేషన్ బియ్యాన్ని రిసైక్లింగ్ చేసి తిరిగి విక్రయిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ప్రభుత్వం ఈ అక్రమ దందాను నిలువరించేందుకే రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తోంది.

5.23 లక్షల మందికి కార్డులు

మేడ్చల్ జిల్లాలోని 619 రేషన్ దుకాణాల ద్వారా 5,23,938 రేషన్ కార్డు దారులకు ప్రతి నెలా ఉచితంగా ఒకరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇందులో 17,18,351 మంది లబ్ధిదారులు(యూనిట్లు) ఉండగా, ఒకరికి 6 కిలోల చొప్పున 10640.052 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేస్తున్నారు. ఉగాది కానుకగా.. ఏప్రిల్ నుంచి రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సన్నబియ్యం అందించేందుకు సంబంధిత ఏర్పాట్లు చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

నీటిని పొదుపుగా వాడుకుందాం..


వాణినగర్‌లో నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్న జలమండలి అధికారులు

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని వాణినగర్ కమ్యూనిటీ హాలులో ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జలమండలి అధికారులు నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జలమండలి డీజీఎం ఆశ్రితనవీన్ మాట్లాడుతూ.. గాలి తర్వాత నీరే మనకు ప్రాణాధారమని, నీటిని వృథా చేయకుండా పరిమితంగానే వాడుకుందామన్నారు. అనంతరం నీటి సద్వినియోగం, నీటి కాలుష్య నివారణ, వాన నీటి సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వాణినగర్ సంక్షేమ సంఘం సభ్యులు సిద్ధయ్య, నర్సింగ్‌రావు, వీరభద్రయ్య, బలరాం, భాస్కర్, సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: హుడా మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వీరేశంయాదవ్ సతీమణి రుక్మిణి అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఆమె భౌతికకాయం వద్ద ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు పరశురామిరెడ్డి, వెంకన్న, శ్రీనివాస్ నివాళులర్పించారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



అల్వాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

అల్వాల్: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రంజాన్ ఆఖరి మాస శుక్రవారం పురస్కరించుకొని అల్వాల్ మజీద్–ఏ–రెహమానియాలో రహమత్‌ఖాన్, సయ్యద్ ఆరీఫ్, గౌస్‌ఖాన్ ముస్లింల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్: మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని మేజిద్ – ఈ ఖుతుబ్ షాహీ ఆలాంగిరి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అస్మతుల్లాహ్ హుస్సేన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం పవిత్రమైందని, ముస్లింలు ఉపవాసాలతో ఉంటారన్నారు. కార్యక్రమంలో హజ్ కమిటీ మెంబర్ మహమ్మద్ ముజీబుద్దీన్, మాజిద్ ఈ ఖుతుబ్ షాహీ ఆలాంగిరి అధ్యక్షుడు ఇస్మాయిల్ పటాన్, కాంగ్రెస్ పార్టీ బోడుప్పల్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్తా, నేతలు దానగల్ల యాదగిరి పాల్గొన్నారు.

90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోండి


కాలనీవాసులతో మాట్లాడుతున్న కమిషనర్ శైలజ

బోడుప్పల్: ఆస్తి పన్ను బకాయిదారులకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీపై కల్పించిన 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. ఎస్సీ బస్తీలో శుక్రవారం ఆమె పర్యటించి ఇంటి పన్ను బకాయిదారులకు 90 శాతం వడ్డీ రాయితీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ బస్తీలో చాలా కాలంగా బకాయిలు ఉన్నాయని వాటిని ఈ నెల 31వ తేదీలోపు చెల్లించాలని, లేనిపక్షంలో డ్రైనేజీ, నల్లా కనెక్షన్లను తొలగిస్తామన్నారు. అనంతరం నిమిషాంబికాదేవి ఆలయాన్ని సందర్శించి ఆ కాలనీవాసులతో చర్చించారు. ఆలయానికి వచ్చే వాహనాల వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆమె దృష్టికి తీసుకురాగా సిబ్బందిని ఏర్పాటు చేసి సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బోడుప్పల్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ చీరాల నర్సింహ, నాయకులు దానగల్ల యాదగిరి, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలకు అన్ని వసతులు కల్పించాలి


మసీదుల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పర్వదినాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. రంజాన్ పండగను పురస్కరించుకొని ముస్లింలకు ప్రభుత్వం అందజేసిన రంజాన్ తోఫాలను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఐజీ కాలనీ, పెద్ద చర్లపల్లి, ఈసగన్, భరత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్ కాలనీల్లోని మసీదులను సందర్శించి రంజాన్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆమెతో పాటు ఇంజినీరింగ్ ఏఈ స్వరూప, స్థానిక నేతలు ఉన్నారు.

గేట్‌లో విజయ స్కూల్ పూర్వ విద్యార్థి ప్రతిభ


నల్లం శ్రీకృష్ణ ప్రీతంను సన్మానిస్తున్న విజయ స్కూల్ యాజమాన్యం

కాప్రా: గేట్–2025 ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో కాప్రా విజయ స్కూల్‌కు చెందిన పూర్వవిద్యార్థి నల్లం శ్రీకృష్ణ ప్రీతం ప్రతిభ కనబర్చాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఆలిండియా 9వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా విజయ స్కూల్ యాజమాన్యం శుక్రవారం శ్రీకృష్ణప్రీతంకు అభినందన సభ ఏర్పాటు చేసింది. స్కూల్ కరస్పాండెంట్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. తమ స్కూల్‌లో చదివిన విద్యార్థి అత్యున్నత స్థానం పొందడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అనంతరం ప్రీతం, తల్లిదండ్రులను స్కూల్ యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొప్పునూరి వీణ, ప్రిన్సిపాల్ దేవినేని వెంగబాబు, ప్రధానోపాధ్యాయురాలు అద్దంకి పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడికి ప్రతిష్టాత్మక టెన్త్‌డాన్ బ్లాక్‌బెల్టు


సాస్వత్ కుమార్

ఉప్పల్: ఉప్పల్ స్థానికంగా నివసించే ఒడిశాకు చెందిన యువకుడు చైనాకు చెందిన ప్రతిష్టాత్మక టెన్త్‌డాన్ బ్లాక్‌బెల్టు సర్టిఫికెట్ దక్కించుకున్నాడు. దాదాపు ఆరు సంవత్సరాలు శ్రమించి సర్టిఫికెట్ దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. ఆల్ జపాన్ మార్షల్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ నుంచి సర్టిఫికెట్ అందుకున్నట్లు ఆయన చెప్పారు.


పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న కాంగ్రెస్

– పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

రామంతాపూర్: పేదల పార్టీ కాంగ్రెస్ అని వారి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ రఫిక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో కొలిచెల్మి స్వామితో పాటు పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఉపేందర్‌రెడ్డి, సందీప్, రాజిరెడ్డి, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఆర్ఐటీఎంలో టెక్నికల్ ఫెస్ట్


కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి తదితరులు

దుండిగల్: మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ కళాశాలల్లో శుక్రవారం టెక్నికల్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. సాంకేతిక అభివృద్ధి భాగంగా నేషనల్ లెవెల్ టెక్నికల్ ఫెస్ట్ వలారస్ 2కె25 ఈవెంట్ జరిగింది. వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. రోబోటిక్స్, కోడింగ్ అండ్ డీబగ్గింగ్, బిల్డింగ్ ఆర్కిటెక్చర్, బిజినెస్ ఈ సమ్మిట్, పేపర్ ప్రజెంటేషన్, వెల్డింగ్, బ్యాటరీ వెహికల్స్, ప్రధానంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మీద భవిష్యత్‌లో కలిగే ఉపయోగాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, డైరెక్టర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థుల వినూత్న ఆలోచనలు, వారి ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం కల్పించడానికి టాప్ క్లాస్ ఈవెంట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. మురళి ప్రసాద్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డా. అర్ణబ్ మాలిక్, డా.అమర్‌నాథ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

కుషాయిగూడ: చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ అన్నపూర్ణకాలనీలోని శ్రీనికేతన్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. లక్ష్యానికి చేరువై చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేశారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ చిక్క నర్సింహ, రవికుమార్, సిబ్బంది లావణ్యవర్మ, భాగ్య, రజిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ లైసెన్స్ రద్దు చేస్తాం

- గడువు ముగిసిన స్వీట్లతో మళ్లీ తయారీ
- విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు
- స్వీట్స్ శాంపిల్స్ ల్యాబ్‌కు తరలించిన అధికారులు


తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ, విజిలెన్స్ అధికారులు

మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ పారిశ్రామికవాడలోని అమన్ స్వీట్స్ తయారీ కేంద్రంలో శుక్రవారం విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు, లేబులింగ్, పారిశుధ్య నిర్వాహణ సక్రమంగా లేకపోవడంతో అవాక్కయ్యారు. గడువు ముగిసిన స్వీట్లు పారవేయకుండా మళ్లీ స్వీట్లుగా తయారు చేస్తున్నారని గుర్తించారు. ఇతర జిల్లాలో తీసుకున్న లైసెన్స్‌తో మల్లాపూర్ పారిశ్రామికవాడలో పరిశ్రమను ఏర్పాటు చేయడంతో ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వీట్స్, ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. లైసెన్స్ రద్దు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

ఉత్తమ మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్‌గా కంబాల శ్రీను


ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న కంబాల శ్రీను

బోడుప్పల్: బోడుప్పల్‌కు చెందిన కంబాల శ్రీను ఉత్తమ మోటివేషనల్, ట్రైనర్‌గా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణలో భాగంగా 54 రోజుల పాటు ఆన్‌లైన్‌లో తరగతులు, మరో రెండు రోజుల పాటు వర్క్ షాపు నిర్వహించారు. ఇందులో అద్భుత ప్రతిభ కనబర్చిన కంబాల శ్రీనుకు డాక్టర్ గంప నాగేశ్వరరావు, కేవీ ప్రదీప్ చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చేసిన సేవలు విద్యార్థులకు, సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అమరేందర్‌రెడ్డి


అమరేందర్‌రెడ్డి

కుషాయిగూడ: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్.అమరేందర్‌రెడ్డి రెండోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కె.మాధవి, ప్రధాన కార్యదర్శిగా బాపిరెడ్డి, జాయింట్ సెక్రటరీగా పీవీ ధనలక్ష్మీ, కోశాధికారిగా కె.మురళి, లైబ్రేరియన్‌గా ఎం.వెంకటేష్, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎస్.శివకుమార్, మహిళ సెక్రటరీగా టి.రేణుకాదేవి, ఈసీ మెంబర్స్‌గా రాధ ప్రసన్న, దినేష సాయి సురేష్‌రావు, సాయి సందీప్, ప్రశాంత్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై విశ్వాసంతో రెండోసారి అధ్యక్షుడిగా గెలిపించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సమస్యలపై నిరంతర పోరాటం చేసి అందుబాటులో ఉంటానన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సుధాకర్‌రెడ్డి

కుషాయిగూడ: విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల బారిన పడి బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవద్దని ఎస్ఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. కుషాయిగూడ పోలీసులు, యాంటీ డ్రగ్ సోల్జర్స్, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఈసీఐఎల్‌లోని సాయి సుధీర్ కళాశాలలో మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అలాగే సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. డ్రగ్స్ బారిన పడ్డవారిని నిర్లక్ష్యం చేయకుండా వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, రాజు, యాంటీ నార్కోటిక్స్ సిబ్బంది సురేష్, మోహన్, ముక్కంటి, శ్రీశైలం కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.